
# నేటి నుంచి కేటీఆర్ రోడ్ షోలు



హైదరాబాద్, మే 1 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా జీహెచ్ఎంసీ పరిధిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం నుంచి రోడ్‌షోలు నిర్వహించనున్నారు. మే 2 నుంచి 7వ తేదీ సాయంత్రం వరకు నిర్వహించనున్న ఈ రోడ్‌షోల్లో భాగంగా సికింద్రాబాద్, చేవెళ్ల, మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో ఆయన ప్రచారం చేయనున్నారు. తొలి రోజు గురువారం జూబ్లీహిల్స్, కూకట్‌పల్లి, 3న సికింద్రాబాద్ , సనత్‌నగర్, నాంపల్లి, 4న కుత్బుల్లాపూర్, మేడ్చల్, కంటోన్మెంట్, మల్కాజిగిరి, 5న ఎల్బీనగర్, ఉప్పల్, ముషీరాబాద్, 6న శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, మహేశ్వరం, 7న ఖైరతాబాద్, అంబర్‌పేటలో కేటీఆర్ రోడ్ షోలు ఉంటాయి.


నమస్తే తెలంగాణ

హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I హైదరాబాద్, గురువారం 2 మే 2024 HYDERABAD


## విద్యుత్ డిమాండ్ పీక్స్

### జీహెచ్ఎంసీ పరిధిలో 38.89 శాతం పెరుగుదల

సిటీబ్యూరో: గ్రేటర్‌లో ఊహించని విధంగా విద్యుత్ వినియోగం నమోదవుతోంది. ఏటా వేసవిలో డిమాండు గణనీయంగా పెరుగుతున్నప్పటికీ, రికార్డు స్థాయిలో నమోదవుతుండటం చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా విద్యుత్ వినియోగం మే నెలలో నమోదయ్యే రికార్డులు ఈసారి ఏప్రిల్‌లోనే నమోదయ్యాయి. గతేడాది(2023) ఏప్రిల్‌తో పోల్చిచే ఈ ఏడాది (2024) ఏప్రిల్‌లో ఒకేసారి 38.89 శాతం విద్యుత్ వినియోగం జీహెచ్ఎంసీ పరిధిలోనే జరిగింది. అదే సమయంలో గరిష్ఠ డిమాండు అత్యధికంగా 4241 మెగావాట్లు నమోదు కాగా, వృద్ధిరేటు 35.91 శాతంగా నమోదైంది. ఏప్రిల్ నెల రికార్డు నెలకొల్పగా, మేలో సైతం ఇదే విధమైన డిమాండు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈనెలలో వినియోగం 95-100 మిలియన్లకు చేరే అవకాశం ఉందంటున్నారు.



# రేవంత్‌కు పాలన తెలియదు

## ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, మే 1: తప్పుడు వాగ్దానాలు చేసి.. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రులకు పాలన ఎలా చేయాలో తెలియదని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. 'మహిళలని చూడకుండా ఇష్టం వచ్చిన్నట్లు మాట్లాడితే ఖబర్దార్ రేవంత్‌రెడ్డి'.. అని హెచ్చరించారు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా.. పట్టించుకోని ముఖ్య మంత్రికి నోరు పారేసుకోవడం అలవాటైందన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పొలాల్లో తిరుగుతూ.. రైతుల కష్టాలు తెలుసుకుంటుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ఐపీఎల్ మ్యాచ్‌లు చేస్తున్నారని విమర్శించారు. ఆత్మహత్య చేసుకున్న రైతుల జాబితాను కేసీఆర్ ఇచ్చినా.. న్యాయం చేయలేదన్నారు. బుధవారం మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నందిహిల్స్‌లో మీర్‌పేట మహిళా విభాగం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు సునీతాబాల్ రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్నర్ సమావేశానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి గులాబీ పూలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానంటున్న రేవంత్ రెడ్డి సచివాలయంలో ఎందుకు కూర్చుంటున్నారో చెప్పాలన్నారు. రేవంత్‌రెడ్డి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీని, కేసీఆర్‌ను, ప్రజలను మోసం చేసిన చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి ఓట్ల ద్వారా ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. తెలంగాణ రాష్ట్రానికి బీజేపీ ఏం చేసిందో చెప్పాలన్నారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఎంపీగా ఉన్నప్పుడు ఏ ఒక్కరోజు కూడా నియోజకవర్గంలో తిరగలేదన్నారు. మోదీని, రాముడిని చూసి ఓట్లు వేయమని అడుగుతున్నారని పేర్కొన్నారు. అలాంటి వారికి ఓట్లు వేస్తే ప్రయోజనం లేదన్నారు. కేసీఆర్ బస్సు యాత్రకు తండోపతండాలుగా తరలివస్తున్న ప్రజలను చూస్తున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులకు వణుకు పుడుతున్నదని చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి కేసీఆర్ పనిచేస్తారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను మర్చిపోయి తప్పుడు ప్రచారం చేయడంలో ముందుంటారని విమర్శించారు. ఈ సమావేశంలో మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కార్పొరేటర్లు సిద్దాల లావణ్య , అనిల్ కుమార్, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసానికి మద్దతుగా జరిగిన ప్రచార సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి



పాదయాత్ర చేస్తున్న సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

# పద్మారావు అంటేనే.. బ్రాండ్

## ఆయన గెలుపును ఎవ్వరూ ఆపలేరు

### ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మారేడ్‌పల్లి: నిరంతరం ప్రజల మధ్య ఉండే సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్ అంటే ఒక బ్రాండ్ అని.. ఆయన గెలుపును ఎవ్వరూ ఆపలేరని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం సనత్‌నగర్ నియోజకవర్గంలోని మోండా డివిజన్‌లో సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాదయాత్ర చేసి..ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ....సికింద్రాబాద్ పార్లమెంటు స్థానంపై బీఆర్ఎస్ జెండాను ఎగురవేసి చరిత్రను తిరుగరాస్తామన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి, అభివృద్ధి ఎంతో కృషి చేసిందన్నారు. అంతకు ముందు మోండా డివిజన్ బండిమెట్‌లో బీఆర్ఎస్ కార్యాలయాన్ని ఎంపీ అభ్యర్థి పద్మారావు, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రూప, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు హరికృష్ణ, నాయకులు నాగులు, తలసాని స్కైలాబ్ యాదవ్, తలసాని ధర్మేందర్ యాదవ్, రాములు, మహేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



వృద్ధుడిని ఆప్యాయంగా పలుకరిసున్న ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్

# 4 గంటలు నరకమే..

### ముందస్తు సమాచారం లేకుండా..రోడ్లు బ్లాక్

### గంటల పాటు ట్రాఫిక్‌లో సామాన్యుల విలవిల

### రాచకొండ పోలీసుల నిర్లక్ష్యం.. ప్రయాణికుల ఆగ్రహం

సిటీబ్యూరో, మే 1 (నమస్తే తెలంగాణ): ముందస్తు సమాచారం లేకుండా ఎక్కడికక్కడ రాచకొండలో రోడ్లు బ్లాక్ చేస్తుండటంతో ట్రాఫిక్‌లో చిక్కుకొని వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఆయా పార్టీలు ప్రచారాల కోసం ముందస్తుగానే అనుమతికి దరఖాస్తు చేయడం, ఆయా రూట్లలో పోలీసులు అనుమతులివ్వడం సాధారణంగా జరిగే ప్రక్రియ. అయితే ప్రముఖుల ప్రచారాల సందర్భంలో సభలు, సమావేశాలు జరిగే ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా పోలీసులు ముందస్తుగానే పరిగణలోకి తీసుకుంటారు. ఇందులో భాగంగా ప్రధానంగా సామాన్యులు ఇబ్బందులు పడకుండా ఉండేలా ఏ రోజు ఏ పార్టీ మీటింగ్ ఉంటుందో..ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నామంటూ.. ముందస్తుగా ప్రకటనలు జారీ చేస్తుంటారు. హైదరాబాద్, సైబరాబాద్‌లో ఇలాంటి ముందస్తు ప్రకటనలు వస్తున్నా.. కొన్ని సందర్భాల్లో రాచకొండలో ఈ విధానం అమలు కావడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని బాలాపూర్, బడంగ్‌పేట పరిసరాల్లో మంగళవారం రాత్రి వివిధ పార్టీల కార్నర్ మీటింగ్‌లు జరిగాయి. దీంతో ప్రధాన రోడ్లన్నీ ఎక్కడికక్కడే జామ్ అయ్యాయి. స్థానిక పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టాల్సి ఉన్నా.. అలా చేయకపోవడంతో ప్రధాన రహదారుల నుంచి రాకపోకలు సాగించే వారు నరకయాతన అనుభవించారు. శ్రీశైలం హైవే, ఎయిర్‌పోర్టుకు వెళ్లే వారు ఎక్కువగా బాలాపూర్ చౌరస్తా నుంచి ఆర్‌సీఐ రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. బెంగళూర్ హైవేకు వెళ్లేవారు తుక్కుగూడ ఔటర్ మీదుగా పాలమాకులకు వెళ్లి అక్కడి నుంచి హైవేలో వెళ్తారు. ఈ కారణంగా బాలాపూర్, ఆర్‌సీఐ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. మంగళవారం ఆ రూట్‌లో వచ్చే వారికి అక్కడ మీటింగ్‌లు జరుగుతున్నాయని, రహదారులను మూసివేశారనే విషయం తెలియదు. ఏదో సాధారణ ట్రాఫిక్ జామ్‌గా భావించి..చాలా మంది కొద్దిసేపు ఎక్కడికక్కడే ఆగారు. అరగంట, గంట.. రెండు, నాలుగు గంటలు.. ఇలా ఆ రోడ్డుపైనే ఉండాల్సి రావడంతో ప్రయాణికులు తీవ్ర ఆసహనం వ్యక్తం చేశారు. కడ్తాల్ నుంచి హైదరాబాద్‌కు కుటుంబంతో వస్తున్న వైద్యుడు రమేశ్ 'ఇదేం బాధర బాబు.. కనీసం ముందస్తు సమాచారం లేదు.. ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి.. పోలీసులను అడిగితే ఆగాలంటూ హుకూం జారీ చేస్తూ ఇబ్బంది పెట్టారు. కుటుంబంతో నాలుగు గంటలు కారులోనే ఉండాల్సి వచ్చింది'.. అంటూ వాపోయారు. వ్యాపారి రత్నాకర్‌రెడ్డి ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి, పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా వందల వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయాయి. పోలీసులు ముందస్తు సమాచారం ఇచ్చి ఉంటే..ఇలాంటి పరిస్థితి వచ్చి ఉండేది కాదంటూ.. ప్రయాణికులు వాపోయారు.

## సామాజిక మాధ్యమాలపై

# పర్యవేక్షణ అవసరం

### బల్క్ ఎస్ఎంఎస్‌లకు అనుమతి తప్పనిసరి

### వ్యయ పరిశీలకులు సెంథిల్ కుమార్

### ఎంసీఎంసీ కేంద్రం సందర్శన

సిటీబ్యూరో, మే 1, (నమస్తే తెలంగాణ): పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకొని జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలోని చీఫ్ పీఆర్వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) సెంటర్‌ను హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు సెంథిల్‌కుమార్ బుధవారం పరిశీలించారు. ఎంసీఎంసీ ద్వారా చేపడుతున్న కార్యకలాపాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అడ్వర్టయిజ్‌మెంట్, చెల్లింపు వార్తల గుర్తింపు, అభ్యర్థుల ఎన్నికల ప్రచారానికి సంబంధించి ఇస్తున్న అనుమతులు, ఆయా రిజిస్టర్ల నిర్వహణ తీరు తెన్నులను పరిశీలించి.. సంతృప్తి వ్యక్తం చేశారు. సామాజిక మాధ్యమాల్లో ఎన్నికల అంశాలకు సంబంధించి మరింత పకడ్బందీగా పర్యవేక్షించాలని ఎంసీఎంసీ నోడల్ అధికారికి సెంథిల్‌కుమార్ సూచించారు. ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సామాజిక మాధ్యమాల్లో పార్లమెంటు ఎన్నికల్లో ముడిపడిన అంశాలను నిత్యం నిశితంగా పరిశీలించాలని సూచించారు. బల్క్ ఎస్ఎంఎస్‌లకు సంబంధించిన అభ్యర్థులు ఎంసీఎంసీ నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాలన్నారు. మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ, ఎలక్షన్ ఎక్స్పెండిచర్ మానిటరింగ్ కమిటీ, ఎంసీసీ నోడల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.



ఎంసీఎంసీ సెంటర్‌ను సందర్శించిన వ్యయ పరిశీలకులు సెంథిల్ కుమార్

### మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

మే 13న జరిగే పోలింగ్ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించేందుకు మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయింది. హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంటు, కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్ ప్రక్రియను బుధవారం జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు అనుదీప్ దురిశెట్టి, హేమంత్ కేశవ్ పాటిల్, మధుకర్ నాయక్, మ్యాన్ పవర్ నోడల్ అధికారి అడిషనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పోలింగ్ డే ఏర్పాట్లపై సమీక్షలు

లోక్‌సభ ఎన్నికల తేదీ దగ్గర పడుతుండటంతో పోలీసులు బందోబస్తు ఏర్పాట్లపై నిమగ్నమయ్యారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిటీ పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్నారు. పోలింగ్ డేకు ముందు రెండు రోజుల పాటు తీసుకోవాల్సిన బందోబస్తు జాగ్రత్తలు, పికెటింగ్ ఏర్పాట్లు తదితర అంశాలపై సూచనలు చేస్తున్నారు.

కంటోన్మెంట్ మూడో వార్డు అన్నానగర్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఓ దుకాణంలో ఇలా కుట్టుమిషన్‌పై దుస్తులు కుట్టారు.





జాంబాగ్ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న హైదరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ గడ్డం శ్రీనివాస్ యాదవ్

# 'ఎర్లీబర్డ్'.. శేరిలింగంపల్లి టాప్



సిటీబ్యూరో: ఎర్లీబర్డ్ స్కీంను యజమానులు చక్కగా సద్వినియోగం చేసుకున్నారు. రూ. 800 కోట్ల నిర్దేశిత లక్ష్యాన్ని ఖరారు చేయగా, బల్దియాకు రూ. 827 కోట్ల ఆదాయం వచ్చింది. మొత్తం 7,34,837 మంది సద్వినియోగం చేసుకుంటే.. అందులో శేరిలింగంపల్లి సర్కిల్ (మొదటి స్థానం)లో 58,512 మంది సద్వినియోగం చేసుకోగా, రూ.109.23 కోట్ల ఆదాయం వచ్చింది. జూబ్లీహిల్స్ సర్కిల్ (రెండోస్థానం)లో 27,074 మంది నుంచి రూ. 8450.82 లక్షలు, ఖైరతాబాద్‌లో 30,849 మంది నుంచి రూ. 6903.51 లక్షలు వసూలైంది. అతి తక్కువగా చాంద్రాయణగుట్టలో కేవలం 6,270 మంది మాత్రమే ఎర్లీబర్డ్‌ను సద్వినియోగం చేసుకున్నారు.



బుధవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గంపై సమీక్ష చేశారు. శ్రేణులకు దిశానిర్దేశం చేశారు



మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపును కాంక్షిస్తూ ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లో బుధవారం కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్‌షోకు విశేష స్పందన వచ్చింది. ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీలు నవీన్‌కుమార్, శంభీపూర్ రాజు రోడ్ షోలో పాల్గొన్నారు. మహిళలు రాగిడి లక్ష్మారెడ్డికి బొట్టుపెట్టి హారతిచ్చి ఘనంగా స్వాగతం పలికారు. -బాలానగర్